- నాడు కేసీఆర్ నాటించిన చెట్లు




కరీంనగర్ చింతకుంట మీది నుంచి జగిత్యాల్ వెళ్లే బైపాస్ రహదారికి ఇరువైపులా తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ హయాంలో హరితహారం పథకంలో భాగంగా నాటిన మొక్కలు నేడు వృక్షాలయ్యాయి.

- నేడు పడకేసిన పారిశుద్ధ్యం



నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో పారిశుద్ధ్యం పడకేసింది. ఆవరణ అంతా అపరిశుభ్రతే.. పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వానకాలం కావడం, కొవిడ్ కేసులు మళ్లీ పెరుగుతుండటంతో రోగులు, సహాయకులు భయాందోళన చెందుతున్నారు.

## లోకం పోకడ




ముందు ఈ అక్రమ వలసలను ఆపండి!

# కష్టపడితేనే కలలు సాకారం

- కేసీఆర్ జీవితమే ఇందుకు నిదర్శనం
- అమెరికాలో ఎవరైనా తెలుగు విద్యార్థులు ఇబ్బందిపడితే న్యాయ సాయం అందిస్తం
- ప్రపంచంతో ఇండియా పోటీపడేందుకు విదేశాల్లో చదివే యువత సహకరించాలి
- మన భారతదేశంలో కంపెనీలు పెట్టండి
- డాలస్ వర్సిటీ విద్యార్థులకు కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): కష్టపడ్డప్పుడే కలలు సాకారమవుతాయని, ఇందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జీవితమే నిదర్శనమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. రాజకీయాల్లో చిన్న వయసుగా పరిగణించే నాలుగు పదుల వయసులో పదవులను త్యాగం చేసి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఉద్యమం మొదలుపెట్టిన రోజు అనేకమంది కేసీఆర్‌ను అవహేళన చేశారని గుర్తుచేశారు. 14 ఏండ్ల నిరంతర పోరాటం తర్వాత ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నప్పుడు సమాజంలోని ప్రతిఒక్కరూ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారని తెలిపారు. తెలంగాణను సాధించిన కేసీఆర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని లక్ష్యాలను అందుకోవాలని విద్యార్థులకు సూచించారు. అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్ మంగళవారం టెక్సాస్‌లోని డాలస్ విశ్వవిద్యాలయ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంతోపాటు పలు అంశాల్లో సూచనలు చేశారు. ఎన్నో ఆశలతో ఉన్నత విద్య కోసం వచ్చిన తెలుగు విద్యార్థులు, అవగాహన లేక ఏవైనా తప్పుచేస్తే వారికి బీఆర్ఎస్ అమెరికా విభాగం తరపున అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.



అమెరికా పర్యటనలో భాగంగా టెక్సాస్‌లోని డాలస్ విశ్వవిద్యాలయ విద్యార్థులతో సమావేశమైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

> “ కేవలం ర్యాంకులు, గ్రేడ్ల కోసం కాకుండా జీవితంలో సాధించాల్సిన ప్రధాన లక్ష్యాలపై విద్యార్థులు దృష్టి పెట్టాలి. లక్ష్యం వైపు సాగే క్రమంలో అవరోధాలు ఎదురైనా, మనతోనే ఉన్న వ్యక్తులు వెనక్కి లాగినా నిబద్ధతతో ముందుకు పోవాలి. ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా సమాజం, ప్రపంచంలో మంచి మార్పు తెచ్చే దిశగా ప్రయత్నం చేయాలి. -కేటీఆర్

### సమాజ మార్పులను అర్థం చేసుకోవాలి

అమెరికా పోవాలన్నా, చదువుకోవాలన్నా గతంలో ఎన్నో వ్యయ, ప్రయాసలకు గురయ్యే వాళ్లమని, ప్రపంచం వేగంగా మారిపోయి ఇప్పుడు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని కేటీఆర్ చెప్పారు. అమెరికా విద్య కూడా అనేక మందికి అందుబాటులోకి వచ్చిందని తెలిపారు . విద్యార్థులు అమెరికా చట్టాలను, అక్కడి సమాజంలో మార్పులను అర్థం చేసుకొని మసలుకోవాలని సూచించారు. చూస్తుండగానే మనిషి జీవితంలో 50 ఏండ్లు పూర్తవుతాయని, ఇంత స్వల్ప కాలంలోనే తమ కలలు, ఆకాంక్షలను అందిపుచ్చుకోవాలని చెప్పారు.

> “ మేధో వలస మన దేశానికి పెను సవాలుగా మారింది. ప్రపంచవ్యాప్తంగా గొప్ప ఆవిష్కరణలు వస్తున్నా.. ఇన్నోవేషన్ రంగంలో ప్రపంచ దేశాలతో ఇండియా పోటీపడి రాణించాల్సిన అవసరం ఉన్నది. అమెరికాలోని ఉన్నత విద్యా సంస్థల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు కొత్త ఆవిష్కరణలపై దృష్టిసారించాలి. మనదేశంలో ఉన్న అపారమైన అవకాశాలను వినియోగించుకోవాలి. -కేటీఆర్

### పెను సవాలుగా మేధో వలస

మేధో వలస మన దేశానికి పెను సవాలుగా మారిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రపంచ వ్యాప్తంగా గొప్ప ఆవిష్కరణలు వస్తున్నాయన్న కేటీఆర్.. ఇన్నోవేషన్ రంగంలో ప్రపంచ దేశాలతో ఇండియా పోటీపడి రాణించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. అమెరికాలోని ఉన్నత విద్యా సంస్థల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు కొత్త ఆవిష్కరణలపై దృష్టిసారించాలని పిలుపునిచ్చారు. అమెరికాలో చదువుకొని ఇండియాకి తిరిగి వచ్చి కంపెనీలు ప్రారంభించాలని కోరారు. మనదేశంలో ఎన్నో సవాళ్లు ఉన్నా అపారమైన అవకాశాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తించుకోవాలని చెప్పారు. దేశం, తెలంగాణ అభివృద్ధిలో విదేశాల్లో చదువుకుంటున్న యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

# పుట్టిన గడ్డకు పెట్టుబడులతో రండి

- బీఆర్ఎస్‌తో ఐటీకి ల్యాండ్‌మార్క్
- కేసీఆర్ వినూత్న పాలసీలతో గుర్తింపు
- కృత్రిమ మేధ (ఏఐ)తో భవిష్యత్తుకు మేలే
- మళ్లీ మేము అధికారంలోకి వస్తాం.. ఐటీ రంగం అభివృద్ధికి కృషి చేస్తం
- డాలస్‌లో ఐటీ కంపెనీల ప్రతినిధుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): భారతదేశంలోని యువత మీలాంటి వారి కోసమే ఎదురు చూస్తున్నది.. సొంత దేశంలో పెట్టుబడులు పెట్టి మాతృభూమి రుణం తీర్చుకోండి.. అని అమెరికాలోని ఐటీ కంపెనీల యాజమాన్య ప్రతినిధులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఐటీ, అనుబంధ పాలసీలతోనే తొమ్మిదేండ్లలో ఐటీకి హైదరాబాద్ ల్యాండ్‌మార్క్ అయిందని తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన డాలస్ నగరంలో అక్కడి ఐటీ కంపెనీల యాజమాన్య ప్రతినిధులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఐటీరంగ అభివృద్ధి కోసం ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్‌లో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన విధానాలతోనే చరిత్రలో ఎన్నడూ లేనంత వేగంగా హైదరాబాద్ ఐటీ పరిశ్రమ ఎదిగిందని వివరించారు. కృత్రిమ మేధ (ఏఐ)తో భవిష్యత్తులో లాభమే జరుగుతుందని భరోసా ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైన తర్వాత అమెరికాలో ఉన్న భారతీయుల్లో ఆందోళన నెలకొన్నదని.. కొత్త పాలసీలు వచ్చినప్పుడు సాధారణంగా టెన్షన్ ఉంటుందని అభిప్రాయపడ్డారు. అమెరికాలో ప్రస్తుత పరిస్థితుల కారణంగా మన దేశంలోని ఐటీ రంగంలో అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ప్రభుత్వాలు, ఐటీ కంపెనీలు కలిసి పనిచేస్తేనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో మనదేశ యువత పోటీ పడగలుగుతుందని తెలిపారు. చిన్న, మధ్యతరహా ఐటీ కంపెనీలు ఇండియాలో ఆఫ్ షోర్ సెంటర్లను ఏర్పాటుచేసే అవకాశం ఉన్నదని స్పష్టంచేశారు. మూడేండ్లలో తిరిగి అధికారంలో వచ్చిన అనంతరం ఐటీ పరిశ్రమను మరింత విస్తృతంగా అభివృద్ధి చేస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.



అమెరికా డాలస్‌లోని ఐటీ కంపెనీల యాజమాన్య ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

### కేటీఆర్ విజన్ ఉన్న నేత

కేటీఆర్ విజన్ ఉన్న నాయకుడని, ఆయన లేనిలోటు తెలంగాణలో స్పష్టంగా కనిపిస్తుందని ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు ఐటీ కంపెనీల యాజమాన్య ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఐటీ పరిశ్రమ అభివృద్ధి మందగించిందని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ పాలనలో తొమ్మిదేండ్లపాటు ఐటీ రంగానికి చేసిన అభివృద్ధిని ప్రత్యేకంగా ప్రశంసించారు. హైదరాబాద్‌పైనే కాకుండా ఇతర ద్వితీయ శ్రేణి నగరాలకూ ఐటీని విస్తరింపజేసి చిన్న, మధ్యతరహా కంపెనీలకు భారతదేశంలో కార్యకలాపాల నిర్వహణ లాభసాటిగా మార్చవచ్చని నిరూపించారని చెప్పారు.

### బీఆర్ఎస్ హయాంలో 10 లక్షల ఉద్యోగాలు

2014లో హైదరాబాద్‌లో కేవలం 3,23,000 ఐటీ ఉద్యోగాలు మాత్రమే ఉంటే.. తాము అధికారం నుంచి దిగిపోయే నాటికి ఆ సంఖ్య 10 లక్షలకు చేరిందని కేటీఆర్ వివరించారు. తమ ప్రభుత్వ చొరవతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎన్నో టెక్ కంపెనీలు అమెరికా ఆవల తమ అతిపెద్ద కార్యాలయాలను హైదరాబాద్‌లో నెలకొల్పాయని చెప్పారు.

# రైతుల భూమిలో గోశాల

మొదటిపేజీ తరువాయి...

భూములను ప్రభుత్వం గోశాల ఏర్పాటుకు స్వాధీనం చేసుకుంటున్నది. దాదాపు ఏడు దశాబ్దాలుగా నిరుపేద రైతులు సాగు చేసుకుంటున్న ఆ భూములు ప్రభుత్వానివంటూ ఆరు నెలల క్రితమే అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో ఆందోళనకు గురైన రైతులు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఆశ్రయించారు. సీఎంతో మాట్లాడుతానంటూ హామీ ఇవ్వడంతో రైతులు ఊరట దొరికిందని అనుకున్నారు. కానీ మంగళవారం రెవెన్యూ అధికారులే కాకుండా ఏకంగా కలెక్టర్ కూడా వచ్చి ‘మీ భూములు తీసుకుంటున్నాం’ అని చెప్పడంతో రైతుల నెత్తిన పిడుగు పడినంత పనైంది.

### 70 ఏండ్లుగా సాగులో నిరుపేద రైతులు

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎనికెపల్లి రెవెన్యూలో ఉన్న 180 సర్వే నంబర్‌లో 99.14 ఎకరాల భూమి ఉన్నది. ఆ భూములను గ్రామానికే చెందిన 50 మంది ఎస్సీ, బీసీ నిరుపేదలు 70 ఏండ్లుగా సాగు చేసుకుంటున్నారు. మరికొంత మందికి 1954లో అప్పటి ఇచ్చింది. వారి వద్ద ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన తోక పాస్ పుస్తకాలు, శిస్తు కట్టిన రశీదులు కూడా ఉన్నాయి. 1983 వరకు రైతులు భూమిశిస్తూ చెల్లించారు. అయినా ప్రభుత్వ భూమి అని రికార్డుల్లో నమోదవుతూ వస్తున్నది. రైతులు కూడా తామే కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్నందున ఎలాంటి ఢోకా ఉండదని భావించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ భూములు వారికి దక్కకుండా చేసేందుకు రంగం సిద్ధమైంది.

### భూములు ఇవ్వబోమని రైతుల స్పష్టీకరణ

జిల్లా కలెక్టర్ సీ నారాయణరెడ్డితోపాటు హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజు, చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ ఏకంగా ఆ భూములను పరిశీలించడానికి మంగళవారం సాయంత్రం వచ్చారు. అధికారులు ఆ భూములను పరిశీలించడానికి వచ్చారన్న విషయాన్ని తెలుసుకున్న రైతులు భూముల వద్దకు చేరుకున్నారు. తమ భూములను ఇవ్వబోమని చెప్పడంతో రైతులు, అధికారుల మధ్య కొంత వాగ్వాదం చోటుచేసుకున్నది. ఎట్టి పరిస్థితిల్లో తమ భూములను ప్రభుత్వానికి ఇచ్చేదిలేదని వారు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. లేకుంటే భూమికి భూమి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. తాము సచ్చినా భూములను మాత్రం ఇవ్వబోమని, ప్రభుత్వం మరోసారి పునరాలోచించాలని రైతుల డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ భూములను గోశాలకు కేటాయించడం జరిగిందని, ఖాళీ చేయాల్సిందేనని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టంచేయడం గమనార్హం. బుధవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఆ భూముల రైతులు వచ్చి తమ డిమాండ్లను చేవెళ్ల ఆర్డీవోకు చెప్పుకోవాలని అధికారులు సూచించారు.

### ఆ భూముల కోసమేనా!?

మొయినాబాద్ మండలం ఎనికెపల్లిలో గోశాల ఏర్పాటు వెనుక మర్మమేమిటనే విషయాలపై వివిధ రకాల వార్తలు వినిపిస్తున్నాయి. గండిపేట పరిధిలో ఇప్పటికే ఒక గోశాల ఉన్నది. శ్రీకృష్ణ గోసేవా సమితి దీనిని నిర్వహిస్తున్నది. వీరికి చెందిన 150 ఎకరాలతోపాటు ప్రభుత్వానికి చెందిన 200 ఎకరాలు వీరి ఆధీనంలోనే ఉన్నది. అందుకే దీనిని ఎనికెపల్లికి తరలించే అవకాశాలు ఉన్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. దీంతో 200 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్కారు స్వాధీనం చేసుకోనున్నదనే వార్తలు గుప్పుమంటున్నాయి. ప్రస్తుతం గోశాల కొనసాగుతున్న భూమి మంచి డిమాండ్ ఉన్న ప్రాంతంలో (ప్రైం ఏరియా) ఉన్నది. అందుకే ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునే క్రమంలోనే ఎనికెపల్లి వద్ద రైతుల నుంచి భూమిని తీసుకుంటున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



తమ భూములను ఇవ్వబోమని కలెక్టర్, ఇతర అధికారులకు తేల్చి చెప్తున్న ఎనికెపల్లి రైతులు

### కిరోసిన్ పోసుకొని చస్తం



తాత, ముత్తాతలు నుంచి ఆ భూములే మాకు ఆధారం. ఆ భూములను సర్కారు గుంజుకుంటే కిరోసిన్ పోసుకొని చస్తాం. అందరం పేదోళ్లమే. మాకు వేరేచోట పట్టా భూములు లేవు. చెట్లపొదలను గుట్టలను రాళ్లను తొలగించి భూములను చదును చేసుకున్నం. ఆ భూములనే సాగుచేసుకొని దశాబ్దాలుగా బతుకుతున్నాం. కాంగ్రెస్ పుట్టినప్పటినుంచి కాంగ్రెస్‌కే ఓటేస్తూ వస్తున్నం. పట్టాలు వస్తాయేమోనని ఎన్నో ఏండ్ల నుంచి ఎదురుచూస్తున్నం.

- అనుసూజ, ఎనికెపల్లి, మొయినాబాద్ మండలం

### మా శవాల మీద గోశాల నిర్మించండి



ప్రభుత్వం మా భూములను బలవంతంగా గుంజుకుంటే మా శవాల మీదే గోశాలను నిర్మించాలి. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు భూమిలిస్తే.. నేటి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదలు సాగు చేసుకుంటున్న భూములను గుంజుకుంటున్నది. 70 ఏండ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములను గోశాలకు కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. నాటి ప్రభుత్వం ప్రతి పేదవాడికి రెండెకరాల భూమిని కేటాయించింది. ప్రభుత్వం ఇప్పటికైనా పునారాలోచన చేయాలి.

- విగ్నేశ్, ఎనికెపల్లి, మొయినాబాద్ మండలం

# ఏపీని నిలువరించండి

**కేంద్ర జల్‌శక్తి శాఖకు తెలంగాణ సర్కారు లేఖ**

**బనకచర్ల విస్తరణపై ఫిర్యాదు**

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ట్రిబ్యునల్ అవార్డులకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ, శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్, బనకచర్ల క్రాస్ రెగ్యులేటరీ విస్తరణ పనులను చేపట్టిందని, వెంటనే జోక్యం చేసుకుని ఆ పనులను నిలువరించాలని కేంద్ర జల్‌శక్తి శాఖను తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర జల్‌శక్తి శాఖకు తెలంగాణ రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం లేఖ రాశారు. కృష్ణా ట్రిబ్యునల్-1 అవార్డు ప్రకారం బేసిన్లోని ప్రాజెక్టులకే నీటి కేటాయింపుల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని గుర్తుచేశారు. అదీగాక శ్రీశైలం ప్రాజెక్టును కేవలం జల విద్యుత్తు ప్రాజెక్టుగానే పరిగణించిందని తెలిపారు. కానీ, ఉమ్మడి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం అవార్డును తుంగలో తొక్కిందని వివరించారు. చెన్నై తాగునీటి సరఫరా పేరిట శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీని ఏర్పాటుచేశారని, అది కూడా అంతర్రాష్ట్ర ఒప్పందంలోని సామర్థ్యాల కంటే అత్యధిక సామర్థ్యంతో కాలువలను నిర్మించిందని గుర్తుచేశారు. 2005లో పోతిరెడ్డిరెడ్డి హెడ్ రెగ్యులేటరీ, శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్, బనకచర్ల క్రాస్ రెగ్యులేటరీలను విస్తరించిందని, బేసిన్ అవతలికి కృష్ణా జలాలను తరలిస్తున్నదని వివరించారు. ప్రస్తుత సామర్థ్యాలను విస్తరించేందుకు జీవో-203ను జారీచేసిందని, ఆ పనులను కూడా చేపడుతున్నదని తెలిపారు.



# బనకచర్లపై ఇంకా స్టడీ చేయలే

**సరైన సమయంలో స్పందిస్తాం**

**చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఏపీ ప్రభుత్వం అక్రమంగా చేపడుతున్న గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఇంకా పూర్తిస్థాయిలో స్టడీ చేయలేదని, త్వరలోనే ఉన్నతాధికారులతో చర్చించి ఎలా ముందుకెళ్లాలనే విషయంపై నిర్ణయం తీసుకుంటామని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో మంత్రి ఉత్తమ్ మంగళవారం పలువురు మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఏపీ దూకుడుగా ముందుకు పోతున్నదని, దీనిపై తెలంగాణ ప్రభుత్వం విధానమేమిటని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దీనికి మంత్రి ఉత్తమ్ బదులిస్తూ.. ఏపీ చేపట్టిన జీబీ లింక్ ప్రాజెక్టుపై ఇంకా పూర్తిస్థాయిలో అధ్యయనం చేయలేదని బదులిచ్చారు. త్వరలోనే ప్రాజెక్టుపై పూర్తిస్థాయిలో ఉన్నతాధికారులతో సమీక్షించి ఏవిధంగా ముందుకెళ్లాలనేది నిర్ణయిస్తామని చెప్పారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్రానికి ఫిర్యాదుచేశామని, ఆ ప్రాజెక్ట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని స్పష్టంచేశారు. దీనిపై త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు.

# మున్సిపాలిటీల్లో డీలిమిటేషన్ షురూ

**19 రోజుల్లో ప్రక్రియ పూర్తి**

**ఈ నెల 21న ఫైనల్ నోటిఫికేషన్**

హైదరాబాద్ జూన్ 3 (నమస్తే తెలంగాణ): మున్సిపాలిటీల్లో డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు మంగళవారం పురపాలక శాఖ కమిషనర్ వివరాలు వెల్లడించారు. ఇప్పటికే సర్వే ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ నెల 4న సాధారణ ప్రజలతోపాటు అభ్యంతరాలు, సలహాల స్వీకరణకు వార్తా పత్రికల్లో ప్రకటనలు విడుదల చేస్తామని తెలిపారు. ఈ నెల 5 నుంచి 11 వరకు సాధారణ ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తామని వెల్లడించారు. 12 నుంచి 16 వరకు విచారణ చేపడతామని పేర్కొన్నారు. 17, 18 తేదీల్లో అప్రూవల్ కోసం కలెక్టర్లకు అప్పీల్ చేస్తామని తెలిపారు. 19న మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టర్‌కు నివేదిక అందజేస్తామని, 20వ తేదీన ప్రభుత్వానికి నివేదిస్తామని వెల్లడించారు. 21వ తేదీన తుది నోటిఫికేషన్ జారీ చేస్తామని వివరించారు.

## వానా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 38.5°c | 24.6°c |
| వరంగల్ | 38.0°c | 26.0°c |
| ఖమ్మం | 38.0°c | 27.0°c |
| మెదక్ | 36.3°c | 23.2°c |
| రంగారెడ్డి | 36.1°c | 21.9°c |
| కరీంనగర్ | 36.0°c | 27.0°c |
| ఆదిలాబాద్ | 35.8°c | 27.2°c |
| నిజామాబాద్ | 35.1°c | 26.9°c |
| మహబూబ్‌నగర్ | 35.0°c | 26.0°c |
| హైదరాబాద్ | 32.8°c | 24.5°c |

# నెమ్మదించిన రుతుపవనాలు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో రుతుపవనాల కదలిక నెమ్మదించింది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఈ పరిస్థితులు మరో 5 రోజులపాటు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో పశ్చిమ, నైరుతి దిశల నుంచి కిందిస్థాయి గాలులు వీస్తుండటంతో రాబోయే ఐదురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురుస్తాయని తెలిపింది. బుధవారం వివిధ జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ వెల్లడించింది.

# మానసిక వైద్యశాలలో ఫుడ్ పాయిజన్

**ఒకరి మృతి.. 70 మందికి అస్వస్థత**

**వారిలో ఇద్దరి పరిస్థితి విషమం**

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్03, (నమస్తే తెలంగాణ): ఎర్రగడ్డలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా ఒక రోగి మృతిచెందగా, 70 మంది రోగులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. రోగులకు సోమవారం అన్నం, అరటి పండ్లు, గుడ్లతోపాటు పరమాన్నాన్ని కూడా వడ్డించారు. సాయంత్రానికి డీసీ, కోర్టు వార్డుల్లోని కొంతమందికి స్వల్ప వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. వైద్యులు చికిత్స అందించినా కూడా డీసీ వార్డులో చికిత్స పొందుతున్న వ్యక్తి (30) తీవ్ర అస్వస్థతకు గురై మంగళవారం ఉదయం చనిపోయాడు. అస్వస్థతకు గురైన 70 మంది రోగుల్లో ఇద్దరి పరిస్థితి విషమించడంతో వెంటనే వారిని ఉస్మానియా జనరల్ దవాఖానకు తరలించి మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్యమందించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ ఆదేశించారు.

# రేపు క్యాబినెట్ భేటీ

**కీలక అంశాలపై చర్చించనున్న మంత్రివర్గం**

హైదరాబాద్, జూన్ 3(నమస్తే తెలంగాణ): మంత్రివర్గ సమావేశాన్ని రేపు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భేటీలో రైతుభరోసా, యువ వికాసం, భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, ఐఏఎస్ బదిలీలపై చర్చించే అవకాశం ఉంది. ఇప్పటికే పలు అంశాలు పెండింగ్‌లో ఉండటంతో ప్రభుత్వం వాటిని నెరవేరుస్తుందా? లేదా అనే చర్చ జరుగుతున్నది. ముఖ్యంగా ఉద్యోగులకు ఇప్పటికే ఐదు డీఏలో పెండింగ్‌లో ఉన్నాయి. కనీసం ఒక్క డీఏకైనా మోక్షం లభిస్తుందనే ఆశ ఉద్యోగుల్లో ఉంది. వానకాలం సీజన్ రావడంతో పంటల సాగు మొదలైంది. దీంతో రైతులు రైతుభరోసా పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. యాసంగి సీజన్ రైతుభరోసా ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇంకా రూ. 4వేల కోట్ల బకాయి ఉంది. దీనికి తోడు ఇప్పుడు వానకాలం సీజన్‌కు మరో రూ. 9,200 కోట్లు కావాలి. అంటే రైతుభరోసా కోసం సుమారు రూ.13,200 కోట్లు అవసరం. ఈ మొత్తానికి క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా? లేదా అనేది చూడాలి. ఇప్పటికే యువ వికాసానికి సంబంధించి అర్హుల జాబితాను సిద్ధం చేయడంతో ఈ పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపి అమలు చేస్తారా? వాయిదా వేస్తారా? అనేది ఆసక్తిగా మారింది.

# బార్లకు దరఖాస్తులపై భారీ అంచనాలు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలోని 24బార్లతోపాటు సరూర్‌నగర్, జల్‌పల్లి, మహబూబ్‌నగర్, నిజామాబాద్, బోధన్‌లో ఒక్కొక్క బార్‌కు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. వాటికి ఇంకా మూడ్రోజులే గడువు ఉండటంతో అందరి చూపు జీహెచ్ఎంసీ బార్లపైనే ఉన్నట్టు ఎక్సైజ్‌వర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికే జీహెచ్ఎంసీ పరిధిలోని 24బార్లకు 356 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఏడాది మొదట్లో 25 కొత్తబార్లకు దరఖాస్తులు ఆహ్వానించగా, 1400 దరఖాస్తులు వచ్చాయి.